మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను


నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066

రంగా రెడ్డి సంపుటి : 13 సంచిక :110 ఎడిటర్: గొడిశాల సోమయ్య సోమవారం 16-09-2024 పేజీలు :4 వెల : 2రూ

# మా జోలికి వస్తే ఊరుకోం..



**నమస్తే హైదరాబాద్ :** ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ ఎపిసోడ్ తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కించింది.. ఈ విషయంలో బీఆర్ఎస్.. కాంగ్రెస్ మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారి స్పందించారు. "మా వాళ్ల ఇంటికి వస్తామని కొందరు సవాల్ విసిరారు.. మా వాళ్లే వాళ్లింటికెళ్లి బుద్ధి చెప్పారు.. మా ఇళ్లపై దాడి చేశారని ఆరోపిస్తున్నారు.. అలాంటప్పుడు దమ్ముంటే రా అంటూ సవాల్ చేయడం ఎందుకు ?.. మా వాళ్లు ఎవరి జోలికి వెళ్లరు.. మా జోలికి వస్తే ఊరుకోం".. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టి.పీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ లో నిర్వహించిన సభకు సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మంత్రులు, ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తే పదవికి రాజీనామా చేస్తానన్నా హరీష్‌రావు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు సీఎం రేవంత్. రుణమాఫీ అయిన రైతుల వివరాలను ఆయనకు పంపిస్తామన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ సౌమ్యుడు కాబట్టి.. ఊర్లలో తమ ఆటలు సాగుతాయని కొందరు అనుకోవచ్చు.. కానీ మహేష్‌కుమార్ గౌడ్ వెనుక తాను ఉన్నానంటూ పేర్కొన్నారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమంటూ వార్నింగ్ ఇచ్చారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా.. వరుసగా రెండుసార్లు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 48 గంటల్లో.. మొదటి రెండు గ్యారంటీలు అమలు చేశామనితెలిపారు. గత ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని నీరుగార్చిందని.. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. ఆడబిడ్డలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేశామని, రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. ముచ్చెర్లలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడతామని.. ప్రపంచానికి ఆదర్శంగా అధునాతన నగరం నిర్మిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. రీజనల్ రింగ్‌రోడ్‌తో తెలంగాణ స్వరూపం మారుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు సెమీఫైనల్స్.. 2029 ఫైనల్స్‌లో మనం ఘనవిజయం సాధించాలి.. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసినప్పుడే ఫైనల్స్‌లో విజయం సాధించినట్టు.. అంటూ పేర్కొన్నారు. రాబోయే పదేళ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు సీఎం రేవంత్. 1994 నుంచి కొనసాగుతున్న పొలిటికల్ ట్రెండ్ గురించి వివరించారు.

# గణేశా.. ట్యాంక్‌బండ్ పిలిచె!




**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, సెప్టెంబరు 15 గణనాథుల 'నిమజ్జనం'పై గందరగోళానికి తెరపడింది. విగ్రహాలను తన మీదుగా గంగమ్మ ఒడికి చేర్చడానికి తావు లేదని బెట్టు చేసిన ట్యాంక్‌బండ్ ఎట్టకేలకు గణపతులకు స్వాగతం పలికింది. ఈసారి కూడా మహా నిమజ్జనం ట్యాంక్‌బండ్ నుంచి ఆర్భాటంగా జరగనుంది. హైకోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనానికి అనుమతి లేదంటూ ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. విగ్రహాలను నీళ్లలో వేయడానికి భారీ ఇనుప జాలీలు పెట్టిన అధికారగణం ఎట్టకేలకు దిగొచ్చింది. అంతేనా.. ట్యాంక్‌బండ్ పైనుంచి నిమజ్జనం కోసం యుద్ధప్రాతిపదికన క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహా నిమజ్జనం సమీపిస్తున్న వేళ భక్తులకు కేక పుట్టించే పరిణామమిది. ఇదంతా గణేశ్ ఉత్సవ సమితి పోరాటం, హెచ్చరికల ఫలితమే!! ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఏడు క్రేన్లు అమర్చారు. సోమవారం మరో ఎనిమిది క్రేన్లు ఏర్పాటు చేస్తారు. ఇక.. ఎన్‌టీఆర్ మార్గ్‌లో తొమ్మిది, పీపుల్స్ ప్లాజా వద్ద ఏడు, జలవిహార్ సమీపంలో రెండు, సాగర్‌లోని బేబీ పాండ్ వద్ద మరో రెండు క్రేన్లు ఉన్నాయి. మొత్తంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం 31 క్రేన్లు అందుబాటులో తేనున్నారు.

# పార్టీని నడుపుతున్నారా? లేక సర్కస్సా?



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్, సెప్టెంబరు 15 అంశంపై ముఖ్యమంత్రి ఓ మాట, మంత్రులు మరో మాట్లాడుతుండడం చూస్తుంటే.. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పార్టీ నడుపుతున్నారా? లేదా సర్కస్ నడుపుతున్నారా? అనే సందేహం కలుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ గాంధీ భవన్‌లో మాట్లాడిన మాటలు, ఉపయోగించిన భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానానికి ఉన్న గౌరవాన్ని రేవంత్ తగ్గిస్తున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మా వాళ్లే కౌశిక్ రెడ్డి ఇంటికెళ్లారని ఓ పక్క ముఖ్యమంత్రి, గాంధీకి తమకు సంబంధం లేదని, ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొడవని మంత్రి శ్రీధర్‌బాబు మరోపక్క అనడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వర్షాల వల్ల వచ్చిన బురదకు తోడు ముఖ్యమంత్రి అసత్యాల వరదతోనూ రాష్ట్ర ప్రజలు తిప్పలు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నామని, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామనే ఇంగితం లేకుండా రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ పదే పదే తన ఎత్తు గురించి దుర్భాషలాడుతున్నారని వాపోయిన హరీశ్.. తెలంగాణ ఉద్యమం తనని మరింత ఎత్తుకు చేర్చిందని చెప్పారు. ఆత్మన్యూనత భావం వల్లే రేవంత్ ఎత్తు అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. తాను తాటిచెట్టంత ఎదిగినా రేవంత్ వెంపలి చెట్టంత కూడా ఎదగలేదని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ మర్యాద ఇచ్చామని, ముఖ్యమంత్రిని సన్నాసి, లిల్లీపుట్ అని తాము అనలేమా అని ప్రశ్నించారు.

2లో

# డిప్యూటీ సీఎంకు అరుదైన గౌరవం..




**నమస్తే హైదరాబాద్ :** తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి భట్టి విక్రమార్కకు ఆహ్వానం లభించింది. మెక్సికోలోని మోంటెగ్రో నగరంలో సెప్టెంబర్ 18 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఈ నోబెల్ శాంతి శిఖారాగ్ర సమావేశాలకు భట్టి విక్రమార్కకు ఆహ్వానం అందింది. అయితే.. 19వ తేదీన జరిగే ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్కను నిర్వాహకులు ఆహ్వానించారు. "ప్రగతి కోసం శాంతి" అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ 200వ వేడుకల్లో నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదులు.. సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో తెలిపారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి.. కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో పేర్కొనటం గమనార్హం. ఈ సమావేశాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందటంపై భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆహ్వానం అందటం.. తనకు ఎంతగానో గర్వకారణమని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే.. టీపీసీసీ కొత్త చైర్మన్‌గా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.. ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సభలో మాట్లాడిన భట్టి.. కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అధిష్ఠానం నుంచి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. అందుకు ఉదాహరణే మహేశ్ కుమార్ గౌడ్‌కు టీపీసీసీ పదవి దక్కడమని అభివర్ణించారు. పీసీసీ పదవిని ఒక బీసీ వ్యక్తికి ఇవ్వటం చాలా గర్వకారణమని భట్టి చెప్పుకొచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మహేశ్ కుమార్ గౌడ్ మరింత బలోపేతం చేస్తారని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. మరోవైపు.. గతంలో పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో చాలా మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కున్నారని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని.. జైళ్లలో వేశారని.. అయినా బెదరకుండా పార్టీ కోసం కష్టపడ్డారని తెలిపారు. ఎన్నో పోరాటాలతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అప్పుల పాలైన తెలంగాణలో.. ఒకటో తారీఖున జీతాలు ఇచ్చే స్థాయికి తీసుకొచ్చామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు.

# నేడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్ : రాష్ట్ర సచివాలయం ముందు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. సచివాలయానికి ఎదురుగా

2లో

# పోటాపోటీగా 'సెప్టెంబరు 17'!



**నమస్తే హైదరాబాద్ :** హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారతదేశంలో విలీనమైన 'సెప్టెంబరు 17' వేడుకల అంశం మరోసారి రాజకీయ పార్టీల మధ్య వివాదాన్ని రగిలించింది. ఇప్పటికే ఒక్కో పార్టీ ఒక్కో పేరుతో ఈ వేడుకలు నిర్వహిస్తుండగా.. తాజాగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా పేరు పెట్టడంతోపాటు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించింది. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా నిర్వహిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా చేపట్టిన ఈ కార్యక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తొలిసారి సెప్టెంబరు 17 కార్యక్రమం జరుగుతుండడంతో రేవంత్ సర్కారు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పేరిట నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ వేడుకలకు హాజరు కావాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తోపాటు రాష్ట్రం నుంచి కేంద్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా లేఖలు రాశారు.

2లో

# పార్టీని నడుపుతున్నారా? లేక సర్కస్సా?

హరీశ్ రావు ఎక్కడ దాక్కున్నాడని సీఎం ప్రశ్నించారని తాను రేవంత్ గుండెల్లోనే నిద్రపోయానని ఎద్దేవా చేశారు. అదృష్టం కొద్దీ సీఎం అయిన రేవంత్ ఆ పదవిలో ఉండేది ఐదేళ్లేనని, కాంగ్రెస్ ఏ రాష్ట్రంలోనూ ఐదేళ్లకు మించి అధికారంలో లేదన్నారు. గాంధీభవన్‌లో సీఎం చెప్పినవన్నీ అబద్ధాలేనని, రుణ మాఫీ అమలు కాలేదనేందుకు ఆధారాలున్నాయని చెప్పారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో రైతులందరికీ రుణమాఫీ జరిగిందా? అనే అంశంపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. వానాకాలం రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఇక, ఫార్మాసిటీ కోసం రూ.1,500 కోట్లు ఖర్చు పెట్టి గత ప్రభుత్వం 12 వేల ఎకరాలు సేకరిస్తే.. సీఎం రేవంత్ అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# పోటాపోటీగా 'సెప్టెంబరు 17'!

ఇదిలా ఉండగా.. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం వరుసగా మూడో సంవత్సరం కూడా పరేడ్ గ్రౌండ్ వేదికగా వేడుకలకు సిద్ధమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డిని కూడా ఆహ్వానించినట్లు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి విస్మరిస్తే.. తెలంగాణ సమాజం ఆయనను క్షమించదన్నారు.

# నేడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని ఎప్పటి నుంచో ప్రతిపాదన ఉంది. అలాంటి చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడమంటే ఆత్మగౌరవం మీద దాడిచేసినట్టేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్న విషయం విదితమే. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెలంగాణకు రాజీవ్ గాంధీకి ఏం సంబంధం ఉందని విగ్రహం పెడుతున్నారంటూ ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా అంటూ కేటీఆర్ నిలదీశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము అధికారంలోకి వచ్చాక రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించి.. తెలంగాణ తల్లి విగ్రహం పెడతామన్నారు. సకల మర్యాదలతో రాజీవ్‌గాంధీ విగ్రహం అక్కడి నుంచి తరలిస్తామని తెలిపారు. అధికారంలో ఉన్నామని ఏదైనా చేస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమని.. ఇప్పుడు విగ్రహం పెట్టినా అధికారంలో వచ్చాక దానిని వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ స్పష్టంచేశారు. అంతే కాకుండా తెలంగాణలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లు మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఇందిరా, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయని.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక అన్ని పేర్లు మారుస్తామని కేటీఆర్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# శ్వేతార్కలో వైభవంగా ముగిసిన ఏకాహం

## జై గణేష నామంతో మోగిపోయిన శ్వేతాలయం



కాజిపేట్ సెప్టెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) కాజీపేట స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో 24 గంటల పాటుగా స్వామివారి జపం ఓం గ%శీ% గణపతయే నమః అనే స్వామివారి మంత్రాన్ని పాటించడం నేటితో ముగిసింది గురు స్వామి దేవులపల్లి సదానందం స్వామి మరియు రాజేష్ హర్ష బిట్ల వెంకటేశ్వర్లు గిరి స్వామి తదితరుల స్వాములచే మరియు దీక్ష స్వాముల బృందం చే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు దేవాలయ వైదిక కార్యక్రమం నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ మరియు మల్లికార్జున శర్మ అనంత చార్యుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు దాదాపుగా వందమంది పైగా స్వాములచే ఏకహాని సమాప్తి చేసుకోవడం జరిగింది. జై గణేశ జై గణేశా అనే నా స్మరణతో శ్వేతాలయం మారి మోగిపోయింది అనంతరం స్వాములకు భక్తులకు ఆశీర్వచనం తీర్థ ప్రసాదితరణ ఇవ్వడం జరిగింది అనంతరం దేవాలయంలో వామన జయంతి పూజలు నిర్వహించడం జరిగింది పిల్లల మేధస్సు కొరకు చదువు అభివృద్ధి కొరకు ప్రతి పిల్లవాడు చేసుకునే పూజ వామన జయంతి పూజలు ఈ సందర్భంగా దేవాలయంలో వామన జయంతి పూజలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చిన్నారులు, విద్యా అభివృద్ధి కొరకు పూజలు నిర్వహించుకొని మూలమంత్ర హోమాన్ని విశేషంగా నిర్వహించుకొని ఆ విద్యా గణపతి యొక్క అనుగ్రహాన్ని పొందారు అనంతరం భక్తులకు అందరికీ అన్నపూర్ణ భవన్లో అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు రాధా ఉమాదేవి మంజుల జయమ్మ రజిత సీనమ్మ కవిత విజయ కోటి స్వరూప చందు వెంకట సాయి తేజ రాజేష్ కన్నా శ్రీహర్ష పాక పవన్ సాయిరాం మహేష్ చింతల బాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు

# ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకుందాం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




హనుమకొండ, సెప్టెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) ఇతర మతాలను గౌరవిస్తు సంతోషాల నడుమ పండుగలను నిర్వహించుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో ఆదివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ట్రై సిటికి చెందిన ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీతో సమావేశమయ్యారు. ఈ నెల 16వ తేదిన మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించాల్సి ఉండగా అదే రోజు గణేశ్ నిమజ్జనం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో ముస్లిం మత పెద్దలతో సమావేశాన్ని ఎర్పాటు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సూచనల మేరకు 19వ తేదిన మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను నిర్వహించేందుకు ముస్లీం మత పెద్దలందరూ అంగీకరించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి మతం వారు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ వారి వారి పండుగలకు సంబంధించిన ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం వరంగల్ నగరవాసుల ప్రత్యేకతని, మతసామరస్య విషయంలో వరంగల్ నగరంలో ఇతర ప్రాంతాలవారికి అదర్శంగా నిలుస్తోందని. ఇదే సంప్రదాయాన్ని భావితరాలవారికి అందజేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా మాట్లాడుతూ వినాయక చవితి పండుగ వేళ మతసామరస్యంలో భాగంగా ఎంతోమంది ముస్లీం యువకులు గణేష్ విగ్రహాలను తయారి చేసి ఉచితం పంపిణీ చేయడం జరిగిందని. గణేష్ నిమజ్జన సందర్భంగా నిమజ్జనం కొసం తరలివేళ్ళే భక్తులకు మార్గమధ్యలో మంచినీరు, మజ్జిగను అందించడం జరుగుతుందని ఖుస్రూ పాషా తెలిపారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డిసిపి రవీందర్, ఏసిపిలు జితెందర్‌రెడ్డి, నందిరాంనాయక్, దేవేందర్‌రెడ్డి,కిషోర్,తిరుపతితో పాటు ఇన్స్‌స్పెక్టర్లు పాల్గోన్నారు.

# సీ ఈ ఐ ఆర్ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకున్న సెల్ ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించిన మడికొండ పోలీసులు



కాజిపేట్ సెప్టెంబర్ 15 (నమస్తే హైదరాబాద్) వివరాలలోకి వెళ్తే 1) భోగి.కుమారస్వామి %=/ా% మడికొండ, 2)శంకరయ్య%=/ా% కడిపికొండ, 3)నేలికంటి.వీరాస్వామి %=/ా% మడికొండ, 4)మానుపటి.జితేందర్%=/ా% మడికొండ, 5)ల్యాదేళ్ళ ప్రవీణ్ %=/ా%తారలపల్లి, 6) డోలీ. కొమురయ్య %=/ా% మడికొండ వారియొక్క మొబైల్ ఫోన్ ను పోగొట్టుకోనగా సి పి ఐ పి ఎస్ అంబర్ కిషోర్ జా చేసిన పత్రిక ప్రకటన చూసి అట్టి మొబైల్స్ ను దొరక పట్టమని మడికొండ పోలీస్ స్టేషన్లో మీసేవ ద్వారా అప్లికేషన్ చేసుకోగా తెలంగాణ డీజీపీ కొత్తగా లాంచ్ చేసిన సి ఈ ఐ ఆర్ ( సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) అప్లికేషన్ ద్వారా గౌరవ సి పి, ఐ పి ఎస్ అంబర్ కిషోర్ జా ఆదేశాల మేరకు పోగొట్టుకున్న సెల్ ఫోన్ లను సీ ఈ ఐ ఆర్ అప్లికేషన్ ద్వారా గుర్తించి పోగొట్టుకున్న వారికి మడికొండ సి ఐ వి.కిషన్ తన చేతుల మీదుగా వారికి అప్పగించగా,మడికొండ పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపినారు. మడికొండ పోలీస్ స్టేషన్ పరిది లో ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే మీసేవ ద్వారా దరఖాస్తు అప్లై చేసుకుంటే సి ఈ ఐ ఆర్ అప్లికేషన్ ద్వారా వెంటనే గుర్తించి ఇస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఎస్ ఐ రాజబాబు మరియు కానిస్టేబుల్ సంపత్ ,వాసు లు పాల్గొన్నారు.

# రేఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ

నాగారం నమస్తే హైదరాబాద్: (సెప్టెంబర్ 17) నాగారం మండలంలోని పేరబోయినగూడెంలో రేఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ట్రస్ట్ ఫౌండర్ రేఖ బోయలపల్లి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 500 మందికి పులిహోర ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ మడ్డి పద్మ,పాక వీరేష్ యాదవ్, పేరబోయిన ఉప్పలయ్య,ఉప్పుల భాస్కర్, సందీప్, మణి, ప్రశాంత్, అఖిల్, లింగరాజు, అరుణ్, ఉదయ్, వేణు, దినేష్, నవదీప్,పెసర మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# సగరులు రాజకీయంగా ఎదిగేందుకు సహకారం అందిస్తా: డీకే అరుణ

## విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం లో హాజరైన ఎమ్మెల్యే యెన్నం



నమస్తే హైదరాబాద్( శేరిలింగంపల్లి న్యూస్ ) సగరులు రాజకీయంగా ఎదిగేందుకు తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ హామీ ఇచ్చారు. ఏ వర్గాలైన ఉన్నత స్థాయిలో నిలవాలంటే ఉన్నత చదువులే కారణం అవుతాయని అభిప్రాయపడ్డారు. సగర సేవా సమితి, మహబూబ్నగర్ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్నగర్లోని ఏనుగొండ సగర భవనంలో నిర్వహించిన సగర విద్యార్థుల కు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో వేలునుకొని ఉన్న రుగ్మతల తొలగింపుకు ఉన్నత చదువులే కారణమవుతాయని ఆమె అన్నారు. భవిష్యత్తు తరాలు ఆశించిన స్థాయిలో మారాలంటే అక్షర జ్ఞానంతోనే మొదలు పెట్టాలని ఆమె సూచించారు. సగరుల అభ్యున్నతి కోసం కుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె అన్నారు. సగరులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో సగరుల రాజకీయ ఎదుగుదలకు తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సగరులు పోటీ చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సగరులు ఆర్థికంగా వెనుకబాటులో ఉన్నారని, ప్రభుత్వపరంగా సగరులకు కావాల్సిన సహకారాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను మరింత ప్రదర్శించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ రిజర్వేషన్ల పై ఆధారపడకుండా ప్రతిభా పాటవాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సగరుల హక్కుల సాధన కోసం రాష్ట్ర సగర సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో సగరులు బి సి డి లో నుంచి ఏలోకి మారెందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. త్వరలోనే రాష్ట్రస్థాయిలో సగర విద్యార్థుల కు ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు ఉన్నతి కోసం సగరులు మరింత ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందని తెలిపారు. సగర సేవా సమితి అధ్యక్షులు పర్వతాలు సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సగర సంఘం చీఫ్ అడ్వైజర్ ఆర్.బి ఆంజనేయులు సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుడ్డన్న సగర, జిల్లా అధ్యక్షులు సాయి ప్రనిల్ చందర్ సగర, మాజీ రాష్ట్ర అధ్యక్షులు బంగారు నరసింహ సగర, రిటైర్డ్ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ నగర్, సగర సేవా సమితి ప్రధాన కార్యదర్శి నారాయణ సగర, కోశాధికారి గోపాల్ సగర, ప్రేమ్ సాగర్, ఉదయ్ సాగర్, అడ్వకేట్ హనుమంతు సాగర్, మూసాపేట్ మాజీ జెడ్పిటిసి ఇంద్రయ్య సగర, బిజెపి సీనియర్ నాయకులు దేవన్న సగర, సగర యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి సవారీ సత్యం సగర, బిసి సమాజ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస సాగర్, చుక్కల చంద్ర శేఖర్ సాగర్, చంద్ర మోహన్ సాగర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ సాగర్, సుధాకర్ సగర తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కలిసిన పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ

నమస్తే హైదరాబాద్( శేరిలింగంపల్లి న్యూస్) పీఏసీ చైర్మన్ గా నియమితులైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఆదివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఎమ్మెల్యే గాంధీ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్బంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యే గాంధీకి అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గాంధీకి సూచించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పీఏసీ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఐటీ ,శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్



బాబు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# ఫణిగిరి స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం బాలుడు మృతి





నాగారం, నమస్తే హైదరాబాద్ : (సెప్టెంబర్15) మండల పరిధిలోని ఫణిగిరి స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది, లారీ ఢీకొని బాలుడు మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే నల్గొండకు చెందిన మహమ్మద్ అఫ్జల్ కుమారుడు మహమ్మద్ అబుబక్తర్ వయస్సు (07) బాలుని అమ్మమ్మ గ్రామమైన ఫణిగిరికి వరుసగా మూడు రోజులు బడికి సెలవు దినాలు ఉండటం వలన రావడం జరిగింది. సూర్యాపేట - జనగాం ప్రధాన రహదారి వెంట ఉన్న కిరాణం షాపు దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్ళడానికి రోడ్డు దాటుతుండగా టి.ఎస్.07యుఎ 1278 నెంబర్ గల లారీ ఢీ కొట్టడంతో మహమ్మద్ అబుబక్తర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి తాత యాకుబ్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ఎం.ఐలయ్య తెలిపారు. బాలుని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి హాస్పిటల్ కు తరలించారు. తమ కళ్ళముందే తమ కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కోదండరాం

పోచారం సెప్టెంబర్ 15 (నమస్తే హైదరాబాద్)మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్ లోని శ్రీ లక్ష్మీ నరసింహ మల్టీ స్పెషాలిటి హాల్ లో, పోచారం మున్సిపల్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు తోటా సత్యనారాయణ, అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉద్యమకారుడు, ఎమ్మెల్సీ కోదండరాం, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు కండువలు కప్పి మెమోటోలు అందించి సన్మానించారు. కోదండరాం మాట్లాడుతూ... పోచారం మున్సిపల్ లో ఉన్న గవర్నమెంట్ ఉపాధ్యాయులు కలిసి, ఈ విధంగా ఒక సంఘం ఏర్పాటు చేసుకొని కలిసికట్టుగా ఉంటూ, ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, నాకు చాలా సంతోషంగా ఉందని. అదేవిధంగా ఈ రోజుల్లో ప్రైవేటీకరణ నేపథ్యంలో కనుమరుగైపోతున్న టీచర్ల పాత్రను పునరుద్ధరణకు, ఉపాధ్యాయుల కృషిని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికి, ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులకు ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో



ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించి, వారి అభ్యున్నతికి చేయూతనిచ్చి, ప్రభుత్వ పాఠశాలలకు, ఉపాధ్యాయులకు పూర్వ వైభవం తీసుకురాటానికి, అభివృద్ధి చేయడానికి, ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుడు జె.ఏస్.సి. మారం లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, ఇస్మాయిల్ ఖాన్ కూడా మాజీ సర్పంచ్ బాలేష్, కొర్రెముల మాజీ వార్డ్ సభ్యుడు జి. మన్యం, సంఘం ఉపాధ్యక్షుడు ఎర్రవెల్లి నాగమల్లు, ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి కిరణ్ కుమార్, కోశాధికారి తొంట కృష్ణ, సిహెచ్. లక్ష్మి, దొడ్డి రవి, పంపరి శివ నారాయణ, నోముల రాములు, భాగ్యలక్ష్మి, తీర్మల్ రెడ్డి, చింతోజు శ్రావణ్ కుమార్, ముక్కర్ల యాదయ్య, బండి మధుకర్, నరసింహారెడ్డి, మానుపాటి శ్రీకాంత్, సూరారం సత్యం మరియు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ నూతన అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మహేష్ కుమార్ గౌడ్ కు హార్దిక శుభాకాంక్షలు



## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్

నమస్తే హైదరాబాద్ తుంగతుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 15: టీపిసిసి నూతన అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ అధిష్టానం నియమించడం పట్ల కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్ హర్షం వ్యక్తం చేశారు . ఆదివారం ఆయన తుంగతుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ... టిపిసిసి నూతన అధ్యక్షుడిగా నియమితుడై ప్రమాణ స్వీకారం చేయనున్న మహేష్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. నిరంతరం పార్టీ కోసం పనిచేస్తూ ఎల్లప్పుడూ కార్యకర్తలు అందుబాటులో ఉండడం ఆయన నైజం అన్నారు. కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందనే వారికి ఇది నిదర్శనం అని అన్నారు. టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ నియామకంతో బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం దక్కిందని అన్నారు.

# చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య




నమస్తే హైదరాబాద్( శేర్లింగంపల్లి న్యూస్ ) చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మియాపూర్ బస్సు బాడీ బిల్డింగ్ దగ్గర చెట్టుకు ఉరి వేసుకొని రహీం(32) అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం. వీరు నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. గత కొన్ని నెలలుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయని ,గొడవల కారణంగా భార్య శ్రావణి అతనికి దూరంగా ఉంటూ అరవింద్ ఫార్మసీలో లేబర్ పని చేసుకుంటూ ఓ ప్రవేట్ హాస్టల్లో ఉంటుంది. తన భార్య కాపురానికి రావడం లేదని ఆటను మనస్తాపం చెంది ఉరివేసుకున్నట్లు సమాచారం. రహీం శ్రీశైలం వాసి. శ్రీశైలంలో ఆటో డ్రైవర్ గా పని చేసేవాడు. అతడిపై స్థానిక పోలీస్ స్టేషన్లో 498 కేసు కూడా నడుస్తుంది. మృతదేహాన్ని పోలీసులు పోస్ట్ మార్టమ్ నిమిత్తం గాంధీ హాస్పిటల్కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్షుడిగా కాసం చక్రధర్.



నాగారం నమస్తే హైదరాబాద్ :(సెప్టెంబర్ 15) నాగారం మండల పీ ఆర్ టి యు టీ ఎస్ మండల అధ్యక్షులుగా కాసం చక్రధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు జ్యోతుల చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి చింతా రెడ్డి రామలింగారెడ్డి పత్రిక సంపాదకుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రఫీ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా బానోతు బాలాజీ నాయక్ కార్యదర్శి కంచనపల్లి శ్రీనివాస్ చారి మహిళా ఉపాధ్యక్షులు పోరెడ్డి హైమావతి లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు రాపర్తి నరేష్ దండగుల ఎల్లయ్య గుండేటి లక్ష్మణరావు కొనతం మల్లయ్య అశోక్ రెడ్డి దొంగరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులు మట్టి వినాయకులకు పూజలు చేయడం అభినందనీయం..



బోడుప్పల్: నమస్తే హైదరాబాద్ : గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 17 డివిజన్ పరిధిలో రామ్ రెడ్డి నగర్ కాలనీ నందు చిన్నారులు సాత్విక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేసిన మట్టి వినాయకుని దర్శించుకుని కాలనీలోని పెద్దలు పాల్గొని అన్న ప్రసాదం తీసుకొని ఆ విఘ్నేశ్వరుని కృపకు పాత్రులైనారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు. మహిళా సోదరులు .పిల్లలూ శివాజీ. అభినవ్. సాయి. అశ్విక్. శ్రీకర్. ఆది. అద్విక్ కి శుభాకాంక్షలు తెలిపారు.

# యువ రైతును చితకబాదిన ఇద్దరు రౌడీషీటర్లు..

నమస్తే హైదరాబాద్ : అచ్చం సినిమాల్లో కనిపించే లాంటి రియల్ సీన్ ఇది. నడి రోడ్డుపై ఆటో పార్కింగ్ చేసుకుని మద్యం సేవిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లు ఓ యువ రైతుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. కర్రలు, ఇనుప రాడ్లతో పశువును బాదినట్లు చితకకొడుతున్నా అక్కడున్న వారంతా ప్రేక్షక పాత్ర వహించారు. ఆ దాడి దృశ్యాలు ఓరుగల్లు ప్రజలకు వణుకు పుట్టిస్తున్నాయి. వరంగల్ లో రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరిపోతు న్నాయి.. అమాయకుల పై వారి కండకవరాన్ని ప్రదర్శిస్తున్న రౌడీషీటర్లు ప్రశ్నించిన వారిపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారు. వరంగల్ నగరంలోని %దీ=% నగర్ ప్రాంతానికి చెందిన మల్లికార్జున్, సమోసా సంపత్ అనే ఇద్దరు రౌడీ షీటర్లు నడి రోడ్డుపై వీరంగం సృష్టించారు. రోడ్డు పై ఆటో పెట్టుకొని ఆ ఇద్దరు రౌడీషీటర్లు మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న యువరైతు సంపత్ పై విచక్షణా రహితంగా దాడిచేశారు. రైతు సంతోష్ పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఆటోలో మద్యం సేవిస్తున్న రౌడీ షీటర్లు మల్లిఖార్జున్, సమోసా సంపత్ అతనిపై ఉమ్మి వేశారు.

# సినిమా



## ఇదెక్కడి ట్విస్ట్ మావా.. ఈ వారం ఆ కంటెస్టెంట్ ఎలిమినేట్..



బిగ్?బాస్ హౌస్ లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే. సీజన్ 8 స్టార్ట్ అయి ఇంకా రెండు వారాలే అవుతున్నా.. ఇప్పటికే ఛాలెంజింగ్ టాస్కులతో కంటెస్టెంట్లకు చుక్కలు చూపిస్తున్నాడు బిగ్?బాస్. మొదటివారం హీటెక్కించిన నామినేషన్స్.. ఇక రెండో వారం కూడా అదే స్థాయిలో జరిగాయి. మొదటి వారం బెజవాడ బేబక్క ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు రెండో వారం ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. మంగళవారం రాత్రి నుంచి ఓటింగ్ లైన్స్ ఓపెన్ కాగా.. అనూహ్యంగా యాంకర్ విష్ణుప్రియ అగ్రస్థానంలో దూసుకుపోతుంది. విష్ణుప్రియకు ఓటింగ్ ఎక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు కారణం కూడా సోనియానే. నామినేషన్స్ సమయంలో విష్ణుప్రియను దారుణంగా అవమానించింది సోనియా. బట్టలు సరిగ్గా వేసుకోవు అంటూ అసభ్యంగా మాట్లాడి తన ఇమేజ్ పూర్తిగా తగ్గించుకుంది. దీంతో సోనియా పై నెటిజన్స్ ఓ రేంజ్ లో ఫైర్ అవుతున్నారు.సోనియా హద్దుమీరి మాట్లాడుతున్నప్పటికీ విష్ణుప్రియ ఏమాత్రం ఎమోషనల్ కాకుండా తన మాటలను తిప్పికొట్టడంతో ఇప్పుడు నెటిజన్స్ కూడా విష్ణుకు సపోర్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఓటింగ్ లో విష్ణు టాప్ లో దూసుకుపోతుండగా.. ఆ తర్వాతి స్థానంలో నిఖిల్ ఉన్నాడు. వీరిద్దరి మధ్య కేవలం పోటీ తక్కువే ఉంది. అటు విష్ణుకు 26 శాతం ఓటింగ్ రాగా.. నిఖిల్ 24 శాతం ఓటింగ్ తో ఉన్నాడు. వీరిద్దరి తర్వాత మూడో స్థానంలో నాగ మణికంఠ ఉండగా.. ఆ తర్వాత నైనిక నాల్గో స్థానంలో నిలిచింది. ఇక శేఖర్ భాషా ఐదో స్థానంలో ఉంటే.. ఆదిత్య ఓం ఆరో స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి మధ్య కేవలం ఒక పర్సెంట్ మాత్రమే ఓటింగ్ డిఫరెంట్ ఉండడం గమనార్హం. ఇక వీరి తర్వాత చివరి స్థానాల్లో పృథ్వీ, సీత ఉన్నారు. వీరిద్దరికి తక్కువ ఓటింగ్ వస్తుండడంతో ఇద్దరిలో ఒకరిని ఎలిమినేట్ చేయనున్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఈవారం పృథ్వీ కాకుండా సీతను ఎలిమినేట్ చేస్తారని సందేహపడుతున్నారు నెటిజన్స్. అందుకు కారణం ఆమె పీఆర్ టీం. అవును.. ఇప్పుడు నామినేషన్స్ లో ఉన్న సీత సంబంధించిన పోస్టింగ్స్ మాత్రం అంతగా కనిపించలేదు. పృథ్వీ కంటే సీత స్ట్రాంగ్ కంటెస్టెంట్ అయినా.. శుక్రవారం వరకు వచ్చే ఓటింగ్ బట్టి ఎలిమినేషన్ పై స్పష్టత రానుంది.



# అద్భుతమైన పానీయం..



వెల్లుల్లిలో అనేక రకాల ఔషధగుణాలు దాగున్నాయి.. అందుకే వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.. సాధారణంగా ఇప్పటి వరకు మన అల్లం లేదా ఇతర రకాల టీలను తాగి ఉంటాం.. అయితే.. కాస్త భిన్నమైన వెల్లుల్లి టీ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. దీనికి సంబంధించిన ప్రయోజనాల గురించి తెలుసుకుంటే.. ఆశ్చర్యపోవాల్సిందేనని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి టీ తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఈ టీ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. వాస్తవానికి చాలామంది వెల్లుల్లి రెబ్బలను, పానీయాన్ని ఉదయాన్నే తీసుకుంటారు.. ప్రతిరోజూ ఉదయాన్నే వెల్లుల్లీ టీ తీసుకుంటే.. అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.. ఇంకా దీనిని ఇంట్లోనే సులువుగా తయారు చేసుకోవచ్చు.. గార్లిక్ టీ.. డయాబెటిస్ కే కాకుండా శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది.. అవేంటో ఇప్పుడు తెలుసుకోండి.వెల్లుల్లి టీ తాగడం వల్ల 7 ప్రయోజనాలు.. అవేంటో తెలుసుకోండి..

వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలు ఉన్నాయి.. అందుకే ఇది పవర్‌ఫుల్ అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కావాలంటే.. మీరు వెల్లుల్లి టీలో కొద్దిగా అల్లం, దాల్చిన చెక్కను కూడా జోడించవచ్చు. తద్వారా ఆరోగ్య ప్రయోజనాలు మరింత మెరుగుపడటంతోపాటు టీ రుచి కూడా పెరుగుతుంది.

డయాబెటిక్ పేషెంట్లకు గార్లిక్ టీ చాలా మేలు చేస్తుంది. దీంతో శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ తగ్గుతాయి. ఇది జీవక్రియ స్థితిలో కూడా సహాయపడుతుంది. వెల్లుల్లి టీ తీసుకోవడం వల్ల శరీరంలోని మురికిని తొలగించుకోవచ్చు.

వెల్లుల్లి టీతో బరువు తగ్గవచ్చు. ఈ టీ మీ శరీరంలోని చాలా భాగాలలో కొవ్వును కరిగించడానికి పని చేస్తుంది. మెటబాలిజం మెరుగుపరిచే లక్షణాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

గార్లిక్ టీ కూడా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. దీని వల్ల గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చు.

గార్లిక్ టీ శ్వాసకోశ వ్యాధులను నివారిస్తుంది. శీతాకాలంలో జ్వరం, దగ్గును నయం చేయడానికి కూడా దీనిని సేవించవచ్చు.

ఈ టీ ఒక శక్తివంతమైన యాంటీబయాటిక్ పానీయం, ఇది శరీర రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

గార్లిక్ టీ శరీరంలో మంటను తగ్గిస్తుంది.

వెల్లుల్లి టీ ఎలా తయారు చేయాలి?

వెల్లుల్లి టీ ఎలా తయారు చేయాలంటే.. దీని కోసం ముందుగా ఓ గిన్నె తీసుకోవాలి. అందులో ఒక కప్పు నీటిని మరిగించాలి. కాసేపయ్యాక వెల్లుల్లిని దంచి అందులో వేయాలి. దీనితో పాటు, ఒక చెంచా నల్ల మిరియాలు వేసి, ఆపై టీ ఐదు నిమిషాలు మరగనివ్వండి.. ఐదు నిమిషాల తర్వాత, ఆఫ్ చేసి టీని ఒక పాత్రలో ఫిల్టర్ చేయండి. ఈ విధంగా మీరు వెల్లుల్లి టీని తయారు చేసుకుని తాగొచ్చు..

# ప్రపంచంలోనే మొదటి ట్రిలియనీర్ ఎవరు?



ప్రపంచంలో అత్యధిక ధనవంతులు ఎవరనే విషయంపై అందరికీ ఆసక్తి ఉంటుంది. ఆ జాబితాలో అనేక మంది వ్యాపార దిగ్గజాల పేర్లు మనకు వినిపిస్తాయి. వారి సంపద విషయంలో కొన్నిసార్లు హెచ్చుతగ్గులుంటాయి. జాబితాలో స్థానాలు మారుతూ ఉంటాయి. అయినప్పటికీ మనందరికీ వారిపై ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. మన దేశానికి చెందిన గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీలు అత్యధిక ధనవంతుల జాబితాలో ఎప్పుడూ కనిపిస్తారు. ప్రపంచంలో ఇప్పుడు అందరూ ధనవంతులూ బిలియనీర్లే. ట్రిలియనీర్ స్థాయికి ఇంకా ఏ ఒక్కరూ ఎదగలేదు. కాబట్టి ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ ఎవరు అవుతారనే విషయంపై చర్చ జరుగుతోంది. అత్యధిక ధనవంతులైన ఎలాన్ మస్క్, గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ లలో ఎవరికీ అవకాశం ఉందో తెలుసుకుందాం.నివేదిక ప్రకారం..

ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ ఎవరు అవుతారనే విషయంపై ఇటీవల ఓ నివేదిక విడుదలైంది. ప్రస్తుతం ధనవంతులైన పలువురి ఆస్తుల పెరుగుదలను ఆధారంగా చేసుకుని అంచనా వేసింది. ఆ నివేదిక ప్రకారం స్పేస్ ఎక్స్ సంస్థ సీఈవో అయిన ఎలోన్ మాస్క్ 2027 నాటికి ట్రిలియనర్ గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన సంపద పెరుగుతున్న తీరు అలాగే కొనసాగితే మస్క్ ప్రపంచంలో మొట్టమొదటి ట్రిలియనీర్ గా రికార్డు నెలకొల్పుతారు. ఇప్పటికే ఆయన 237 బిలియన్ల యూఎస్ డాలర్ల నికర విలువతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్నారు.

2028లో గౌతమ్ అదానీ..

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి కూడా ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన సంపద పెరుగుతున్న లెక్కప్రకారం 2028 నాటికి ఆ ఘనత సాధిస్తారు. ప్రస్తుతం అదానీ షేర్ సంపద 100 బిలియన్ డాలర్ల కన్నా తక్కువే. సంపద విషయంలో ఆయన 13వ స్థానంలో కొనసాగుతున్నారు. ఆయన సంపద 123 శాతం చొప్పున పెరుగుతోంది. ఇదే కొనసాగితే 2028 నాటికి ట్రిలియనీర్ అవుతారు.2033లో ముఖేష్ అంబానీ..

రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కూడా ట్రిలియనీర్ అయ్యే జాబితాలో ఉన్నారు. ఈయన సంపద సగటున 28.25 శాతం వార్షిక రేటుతో పెరుగుతోంది. ఇదే కొనసాగితే 2033 నాటికి ఆయనకు ట్రిలియనీర్ అయ్యే అవకాశం లభిస్తుంది. వీరితో పాటు ప్రపంచంలోని ప్రముఖులైన జెన్ సన్ హువాంగ్, ప్రజోగో పాంగ్గెస్టు, బెర్నార్డ్ ఆర్నాల్డ్, మార్క్ జూకర్ బర్గ్ తదితరులు కూడా ట్రిలియనీర్ జాబితాలో చేరే అవకాశం ఉంది.

ట్రిలియనీర్ అంటే..

ఒక బిలియన్ డాలర్ అంటే 8500 కోట్ల రూపాయల సంపద కలిగిన వారిని బిలియనీర్లు అంటారు. ట్రిలియనీర్ కావాలంటే లక్ష కోట్ల డాలర్ల సంపద ఉండాలి. అంటే 85 లక్షల కోట్ల విలువైన ఆస్తిని సంపాందించాలి. ప్రస్తుతం ఎలోన్ మస్క్ ఆస్తి విలువ 251 బిలియన్ డాలర్లు. ఆయన సంపద 110 శాతం రేటులో పెరుగుతోంది. ఇదే కొనసాగితే ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రిలియనీర్ గా మారతారు. ప్రపంచంలో మొదటి ట్రిలియనీరు ఎవ్వరు అవుతారనే విషయంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# వారెవ్వా.. అదిరిపోయే క్రియేటివిటీ..

టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్‌ను టీమిండియా గెలుచుకున్న విషయం తెలిసిందే. సౌతాఫ్రికాతో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఈ ఫైనల్లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. దాదాపు 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టీమిండియా ఐసీసీ ట్రోఫీని ముద్దాడింది. భారత్‌కు ఇది రెండో టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. ఫైనల్ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో సఫరా ఆటగాడు డేవిడ్ మిల్లర్ కొట్టిన బంతిని సూర్యకుమార్ యాదవ్ బౌండరీ లైన్ దగ్గర స్టన్నింగ్ క్యాచ్ చేశాడు. ట్రోఫీని ఇక సౌతాఫ్రికా సొంతం చేసుకోవడం దాదాపుగా ఖాయమనుకున్న సమయంలో.. ఈ ఒకే ఒక్క క్యాచ్ మ్యాచ్‌ను మలుపుతిప్పేసింది. టీ20 వరల్డ్ కప్ విజేతగా రెండోసారి భారత్ ఆవిర్భవించేలా చేసింది.బౌండరీ లైన్ దగ్గర సూర్య కుమార్ ఒడిసి పట్టుకున్నది బంతిని కాదు.. టీ20 వరల్డ్ కప్ ట్రోఫీని అంటూ ప్రశంసలు వెల్లువెత్తాయి. వాస్తవానికి సూర్యకుమార్ యాదవ్ చేసిన ఆ అద్భుతమైన క్యాచ్.. సగటు భారత క్రికెట్ అభిమాని మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది అనడంలో అతిసయోక్తి లేదు. భారత్‌కు సూర్య క్యాచ్ మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానులు ఏర్పాటు చేసిన ఓ మండపం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో సూర్యకుమార్ యాదవ్ క్యాచ్ సన్నివేశం థీమ్‌తో ఈ గణేశ్ మండపాన్ని రూపొందించడం విశేషం. గుజరాత్‌లోని వాపిలో స్థానిక క్రికెట్ అభిమానులు ఈ మండపాన్ని ఏర్పాటు చేశారు.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..